# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 336 | శుక్రవారం | 26 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




8లో..

## సర్వీస్ రూల్స్ సవరణపై హర్షం

**మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపిన ఎండోమెంట్ ఉద్యోగులు**

# మూడేళ్లైనా.. మూసివేతే






**తెరుచుకోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ గేట్లు**

**రూ.1.60కోట్ల కుడా నిధులు వృధా**

**రెండు ఫౌంటేన్ల ఏర్పాటు**

**ఆగుతూ సా..గుతున్న పనులు**

**స్పందించని అధికారులు**

నగర ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పంచాలన్న లక్ష్యంతో 1996లో అప్పటి మునిసిపల్ కమిషనర్ శాలినీ మిశ్రా ప్రత్యేక శ్రద్ధతో నిర్మించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలిచింది. నిత్యం వివిధ పనులతో సతమతమవుతున్న నగర ప్రజలు సాయంత్రం వేళ ఆటవిడుపుగా బయటికి వచ్చి అటు భద్రకాళి అమ్మవారిని దర్శనం చేసుకోవడంతోపాటు కొద్ది సేపు రంగు రంగులు విరజిమ్ముతూ నృత్యం చేస్తున్న మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ తిలకించాలనుకున్న వారికి నిరాశే మిగులుతోంది. మరమ్మతుల పేరుతో మూసివేసిన మ్యూజికల్ గార్డెన్ మూడేళ్లైనా తెరుచుకోవడం లేదంటే 'కుడా' అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రూ.1.60కోట్ల కుడా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ అవి ఆగుతూ సా..గుతున్నాయి. గత డిసెంబర్ లోనే పనులు తుది దశకు చేరుకున్నాయంటూ ప్రకటించిన అధికారులు ఏడు నెలలు పూర్తవుతున్నా సందర్శనకు అనుమతించకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మ్యూజికల్ గార్డెన్‌ను తెరిపించాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో

## సఖి కేంద్రంలో కలెక్టర్

**మహిళల్లో అవగాహనపై ఆరా**



8లో..

## తెలంగాణ హక్కుల కోసం కొట్లాడండి

**పదవిపోయినా పర్వాలేదు**

**కేంద్ర మంత్రులకు మాజీ ఎంపీ బోయినపల్లి పిలుపు**



2లో..

## కూరగాయల మార్కెట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామంటూ హామీ**

# మూడేళ్లైనా.. మూసివేతే



**తెరుచుకోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ గేట్లు**

**రూ.1.60కోట్ల కుడా నిధులు వృథా**

**రెండు ఫౌంటేన్ల ఏర్పాటు**

**ఆగుతూ సా..గుతున్న పనులు**

**స్పందించని అధికారులు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న కాకతీయ మ్యూజికల్ గార్డెన్ మూడేళ్లుగా మూతపడే ఉంది. మరమ్మతులు పేరుతో కరోనా సమయంలో మూసిన గేట్లు ఇప్పటికీ తెరుచుకోలేదు. అభివృద్ధి పనులకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ రూ. 1.60కోట్లు కేటాయించినా పనులు ఆగుతూ సా..గుతూనే ఉన్నాయి. నగర ప్రజలతోపాటు ఇక్కడికి వచ్చే పర్యాటకులకు మ్యూజికల్ గార్డెన్ ఎంతో ఉపయుక్తంగా ఉండేది. పర్యాటకులు నగరంలోని వేయి స్తంభాల ఆలయం దర్శనం చేసుకొని అక్కడినుంచి నేరుగా భద్రకాళి ఆలయానికి చేరుకొని సుప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి దర్శనం అనంతరం ఆటవిడుపుగా మ్యూజికల్ గార్డెన్ సందర్శించేవారు. అనంతరం నగరంలోని ఏదో ఒక ప్రముఖ హెూటల్ లో బస చేసేందుకు అనువుగా ఉండేది. అలాంటి మ్యూజికల్ గార్డెన్ మూసివేసి మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ తెరుచుకోక పోవడం కుడా అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

## 1996లో ఏర్పాటు..

వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ అయిన శాలినీ మిశ్రా ప్రత్యేక శ్రద్ధతో 1996లో మ్యూజికల్ గార్డెన్ కు శ్రీకారం చుట్టారు. ప్రారంభించిన తొలి నాళ్లలో నగర ప్రజలు ఆహ్లాదం కోసం పెద్ద సంఖ్యలోనే గార్డెన్ కు వచ్చేవారు. క్రమంగా నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆదరణ తగ్గిపోయింది. దీంతో మూడు సంవత్సరాల క్రితం కరోనా కాలంలో పునరుద్ధర పేరుతో మ్యూజికల్ గార్డెన్ ను మూసివేశారు.

## రూ. 1.60కోట్లతో అభివృద్ధి..

రెండు సంవత్సరాల క్రితం రూ. 1.60కోట్ల కుడా నిధులతో గార్డెన్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. మ్యూజికల్ గార్డెన్ ను ప్రారంభించి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. గార్డెన్ కు వచ్చే సందర్శకులకు పసందైన సంగీతానికి అనుగుణంగా వాటర్ తో నాట్యం చేసే రెండు ఫౌంటేన్ లను ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. గార్డెన్ వెనుక భాగంలో ఒక ఫౌంటేన్, మధ్యలో మరో ఫౌంటేన్ ఏర్పాటు చేసేలా ప్లాన్ చేశారు. మ్యూజికల్ గార్డెన్ ఎంట్రెన్స్ లో గ్రీనరీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. చిన్నారులకు ఆటవిడుపుగా పలు ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. పునరుద్ధరణలో భాగంగా గార్డెన్ లోని రెండు బ్రిడ్జీలకు పైకప్పులతో పాటు గ్రానైట్ టైల్స్ వేశారు.

## ఆగుతూ సాగుతూ..

కుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు ఆగుతూ సా..గుతూనే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ఇప్పుడు చేస్తాం..అప్పుడు చేస్తామంటూ పనులను సాగతీస్తున్నారు. గత డిసెంబర్ లోనే పనులు చివరి దశకు వచ్చాయంటూ ప్రకటించిన కుడా అధికారులు ఏడు మాసాలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు తిరిగి గార్డెన్ గేట్లు తెరువలేదు. అసలు అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో అయోమయ పరిస్థితి నెలకొంది. వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్నా పనులు పరుగులు పెట్టకపోవడంపై నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు. గ్రేటర్ కమిషనరే కుడా వైస్ చైర్మన్ గా కూడా ఉన్నప్పటికీ అభివృద్ధి పనులను పర్యవేక్షించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# కూరగాయల మార్కెట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామంటూ హామీ**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ ను అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్ లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. వ్యాపారులకు, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ మొత్తం అధికారులతో కలియ తిరుగుతూ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ యార్డులో పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు కూరగాయల వేస్ట్ ను తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మార్కెట్ లోకి ప్రైవేట్ వాహనాలను అనుమతించడంతో కొనుగోలుదారులకు ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విక్రయదారులు, రైతులు, వినియోగదారులకు ఉన్న సమస్యలను కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. హెూల్ సేలర్స్, రిటైలర్స్ లకు మోడల్ కూరగాయల మార్కెట్ లో కేటాయించిన స్టాల్స్ లో మాత్రమే విక్రయాలు కొనసాగించాలని బయట విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూరగాయలు విక్రయించేందుకు వచ్చే రైతులకు కూడా సౌలభ్యం కొరకు స్థలాన్ని కేటాయించాలని మార్కెట్ అధికారులను కలెక్టర్ కోరారు. కూరగాయల ధరల వివరాలు తెలిపే ఎలక్ట్రానిక్ పట్టికను ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లక్ష్మీపురంలో రూ. 24 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనుల ప్రగతిని కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అనిల్, జిల్లా మార్కెటింగ్ అధికారి



ప్రసాద్ రావు, కార్యదర్శి నిర్మల, డీఈ ఎల్లేష్, జీడబ్ల్యూఎంసీ ఈఈ శ్రీనివాసరావు, డీఈ రవికుమార్, ఏఈ హబీబుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలానే లక్ష్యంతో సమీకృత రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల సముదాయ భవన నిర్మాణం చేపడుతున్నట్లు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్, ఆర్ డీఓ, తహసీల్దార్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి ఇంజనీర్లతో కలసి మండల కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థల పరిశీలన చేశారు. ముందుగా రైతు వేదిక వద్ద ఉన్న ఓపెన్ ల్యాండ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే అనంతరం ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ఉన్న ఓపెన్ ల్యాండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడారు.. మండల కేంద్రంలో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. సరైన కార్యాలయాల నిర్మాణం లేకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పరిపాలన సౌలభ్యం కొరకు సమీకృత డివిజన్ లెవెల్ కార్యాలయాల సముదాయాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. 50 వేల ఎస్ఎఫ్‌టీలో దాదాపు 20 కార్యాలయాలు ఒకే దగ్గర ఉండే విధంగా జీప్లస్ వన్ తరహాలో రెవెన్యూ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం ఉంటుందన్నారు. ముఖ్య మంత్రి అంగీకారంతో అక్టోబర్ నెలలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి జక్కా శ్రావణి అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. గ్రామాలలో ప్రధానంగా మురికి నీరు నిలువలు ఉండకుండా చూడాలని, సైడ్ కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు కృషి చేయాలని ఆమె తెలిపారు. గ్రామంలోని అధికారులు నాలుగు భాగాలుగా విడిపోయి ప్రతి మంగళ, శుక్రవారం గ్రామ ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరికి వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రత గురించి తెలియజేయాలన్నారు. ఎక్కువగా నీరు నిలువ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తూ సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఏఎన్ఎం శారద, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గూడెల్లి యాకయ్య, అంగన్వాడీ టీచర్లు అలివేలు, పద్మ, సరోజన, కవిత ఆశా వర్కర్లు ఉపేంద్ర, శ్రీలత, దీపిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ పురోహిత అర్చక సంఘం ఎన్నిక



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా విశ్వబ్రాహ్మణ అర్చక సంఘం అధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్నటువంటి ఫంక్షన్ హాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో నూతన కార్యవర్గం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మశ్రీ దూది కట్ల ప్రకాశాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా గుండోజు వాసుదేవా చార్యులు, కోశాధికారిగా పత్తిపాక కుమారస్వామిలను ఓటింగ్ ద్వారా ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గానికి విశ్వబ్రాహ్మణ అర్చక సంఘం తరపున విశ్వబ్రాహ్మణ పురోహితులను సన్మానించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథులు బ్రహ్మశ్రీ రామడుగు నరసింహాచార్యులు, బ్రహ్మశ్రీ గుండోజు నాగార్జున చార్యులు, బ్రహ్మశ్రీ కారేపూడి కృష్ణమూర్తి, బ్రహ్మశ్రీ ఇటికెల విశ్వ ప్రకాశాచార్యులు, దోనోజు పరిపూర్ణాచార్యులు, సమ్మి సనాతన చార్యులు, విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘాలు పాల్గొన్నాయి.

## సమస్యలు పరిష్కరించాలి

### కలెక్టర్‌కు ఆర్పీ జయంతి లాల్ వినతి



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక పురపాలక సంఘం 21వ వార్డులో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనిని చేపట్టాలని పరకాల కమిషనర్ కు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కలిసి సమస్యల గురించి విన్నవించారు. పురపాలక సంఘం పరకాలలో విడుదలలైన రూ.25 కోట్ల నిధుల నుంచి 21వ వార్డుకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. శ్రీసుర రవి ఇంటి నుంచి బంధం రోడ్డు వరకు వయా నటరాజ్ టాకీస్ ముందు నుంచి సీసీ రోడ్డు పనులు చేపట్టవలసి ఉంది. గత సంవత్సరమే సదరు గుత్తే దారుడు సీసీ రోడ్డు పనులను ప్రారంబించాల్సి ఉన్నా కానీ, ఆ పనిని ఇప్పటి వరకు చేపట్టలేదు. దీంతో మా వార్డు ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి, తక్షణమే స్పందించి సదరు గుత్తే దారుడితో మాట్లాడి ఆ సీసీ రోడ్డు నిర్మాణ పనిని త్వరితగతిన చేయించాలని కలెక్టర్ ను ఆయన కోరారు.

# అంతరాలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** అంతరాలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం నర్సంపేట నియోజకవర్గ సీపీఐ రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు నెక్కొండ మండల కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమానికి మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు అద్యక్షత వహించగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పెట్టుబడిదారీ, దోపిడీ వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం పెరుగుతూ పోతున్నదని, అయినా పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పని చేస్తున్నారని అన్నారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజూవారి ఆదాయం వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ఈ క్రమంలో దేశంలోని భూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడీపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఈ తరుణంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారత దేశంలో మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదని అన్నారు. కేంద్రంలో గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, తిరిగి మరోసారి వారి అండతోనే అధికారంలోకి వచ్చి వారి మేలు కోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. పేదలు, మద్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. కేంద్రంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇందుకు నిదర్శనం అని, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో తీరని ద్రోహం తలపెట్టినా బీజేపీ ఎంపీలు, నాయకులు వంత పాడడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలు, కష్ట జీవుల కోసం రానున్న రోజులలో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మిషా, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, జిల్లా సమితి సభ్యులు ఆరెల్లి రవి, మియాపురం గోవర్ధన్, గడ్డం యాకయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, లాదెళ్ల శరత్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, అయితే యాకోబు ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేష్, దామర కృష్ణ, మైదం యాకయ్య, నీరెటి రజిత తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల నుంచి ప్రజలను కాపాడండి

### సీపీఎం నేత బానోతు సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కుక్కల దాడి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడండని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోకుక్కలు, కోతులు, దోమలను నివారించాలని శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు చిపిరి యాకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, కోతుల వల్ల ప్రజలకు ప్రాణహాని తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో కుక్కల బారిన పడి పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోతులు ఇండ్లలోకి వచ్చి వస్తువులను పడచేస్తూ ప్రజలపైన దాడి చేస్తున్నాయని, దాడిలో అనేక మంది గాయపడ్డారని అన్నారు. అలాగే పట్టణంలో దోమల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తక్షణమే అధికారులు కుక్కలు, కోతులు, దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు అల్లి శ్రీనివాస్ రెడ్డి, రావుల రాజు, హేమ నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న, బానోతు వెంకన్న, తోట శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్, బూర్గుల లక్ష్మణ్, గడిపల్లి శ్యామ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

### యుద్ధంలో ప్రాణాలర్పించిన జవాన్లకు నివాళి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో దేశం కోసం అమరులైన సైనికులను స్మరించుకొని పూల మాలలతో ఘనంగా పలువురు మాజీ సైనికులు నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అమరవీర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు రాజు మాట్లాడుతూ 2003 సంవత్సరంలో జులైలో కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన వారికి ఘనంగా నివాళులు అర్పించామన్నారు. కార్గిల్ పోరులో పాకిస్తాన్ మూకలను దేశం నుంచి తరిమికొట్టి వారిపై విజయం సాధించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన రోజును కార్గిల్ విజయ్ దివస్ గా జరుపుకుంటామన్నారు. కార్గిల్ పోరులో వీరమరణం పొందిన సైనికుల ఆత్మ శాంతి కోసం కార్గిల్ విజయ్ దివస్ ను ప్రతి సంవత్సరం జులై 26న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పయన వీర జవాన్లను భారత జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. దేశ రక్షణ కోసం భారత దళాలు ప్రతిక్షణం రెడీగా ఉంటాయని అన్నారు. జిల్లా కేంద్రంలో కార్గిల్ స్మారక చిహ్నాన్ని, సైనిక భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు సత్యనారాయణ, యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాలు కీలకం

### 31న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాలు కీలకమని, ఆ వైపున ఉద్యమించాలని, జిల్లాలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం బాషబోయిన సంతోష్ అద్యక్షత వహించగా కర్రె భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారంకు నోచుకుంటాయని, ఆ ప్రజా పోరాటాలను నిర్మించేందుకు ప్రజా సంఘాలు కీలకమని వారు అన్నారు. ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం దేశ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూంలు కట్టించి ఇస్తామని తీవ్ర నిర్లక్ష్యం చేసినందువల్లే అధికారం కోల్పోయిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయ చూపడంలో నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు ఇండ్ల స్థలాల సమస్య పై ఈ నెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి పేదలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, ప్రజా సంఘాల నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, మంచాల రమాదేవి, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, శంకర్ నాయక్, నిమ్మల మనోహర్, ప్రణీత్ గౌడ్, లావుడ్య రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులకు ప్రాముఖ్యత

## స్పిక్ ఫర్టిలైజర్స్ ఆత్మీయ సమావేశం
## హాజరైన మార్నేని రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సేంద్రియ ఎరువుల ఉత్పత్తులపై హంటర్ రోడ్డులోని డీఎల్ కే బ్యాంక్వెట్ హాల్ లో స్పిక్ ఫర్టిలైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల దిగుబడి పెంచడానికి, అధిక మోతాదులో కృత్రిమ వనరులైన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటం పరిపాటి అయ్యిందన్నారు. పైర్లకు పోషకాలు అందించడంలో సమతుల్యత పాటించకపోవడం వల్ల నేల ఆరోగ్యం, ఉత్పాదకత తగ్గిపోవడం జరుగుతుందన్నారు. అంతేకాక, రైతులు పురుగులను,



తెగుళ్లను, పోషక మూలకాల లోప లక్షణాలను గుర్తించడంలో సరైన అవగాహన లేక సస్యరక్షణ మందులను విచక్షణారహితంగా వాడటం వల్ల పండించిన పంటల్లో అధిక మోతాదులో రసాయన అవశేషాలు ఉండటం, పర్యావరణ కాలుష్యం వంటివి వాటిల్లడం జరుగుతోందనీ అన్నారు. ఆరోగ్యం, పర్యావరణ రక్షణపై పెరుగుతున్న శ్రద్ధ కారణంగా సేంద్రీయ ఎరువులకు ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. కాబట్టి, సహజ వనరులైన సేంద్రీయ ఎరువులను ఉపయోగించి పర్యావరణాన్ని సంరక్షిస్తూ, నాణ్యమైన, అధిక దిగుబడులను రైతులు పొందాలని అన్నారు. సేంద్రియ ఎరువులపై ఇంత పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్న స్పిక్ ఫర్టిలైజర్ కంపెనీ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పిక్ మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ, మార్క్ ఫెడ్ డీఎం శ్యామ్, రీజినల్ మేనేజర్ సుబాన్, డెవలప్ మెంట్ మేనేజర్ సురేష్, సహకర సంఘాల సీఈఓలు, మార్క్ ఫెడ్, ఓడీఎస్ఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీకి చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణ బీఆర్ఎస్ నాయకుడు చందుపట్ల తిరుపతి రెడ్డి తల్లి చందుపట్ల రాధమ్మ అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం ఉదయం పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి రాధమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల మృతిచెందిన కొలనుపాక రాజవీరయ్య, శ్రీరామోజు వీరాచారి, యర్రం సత్యమ్మ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకులు నక్క చిరంజీవిని చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే
ఆత్మకూరు మండలం నాగయ్యపల్లె గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పోగుల చిన్న సాంబరెడ్డి, అప్పని బుచ్చివీరు, మాదాసి వీరలక్ష్మీ కుటుంబాలను పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## చీర పరచి 'నారు'
### విత్తనాలకు గొడుగుల చీరలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయం వైపు ఆడుగులు వేస్తున్నారు. ట్రాకర్లు, అవులు, హలం, విత్తనాలు చేతబట్టి పోలం బాట పడుతున్నారు. నర్సరీల్లో పెంచిన, కోనుగోలు చేసిన నారు అతి సున్నితంగా సుకుమారంగా పెరిగి కేవలం ఓ కాపుకే మొక్క డీలా పడిపోందని భావించి మొక్కను విత్త దశ నుంచే బలంగా పెంచాలని భావించిన రైతు వినూత్నంగా అలోచించాడు. గతంలో నర్సరీ నుంచి కోనుగోలు చేసిన నారు అశించిన మేరకు దిగుబడి ఇవ్వలేదని, ఈ సారి తానే బలమైన నారు పెంచేందుకు చర్యలు తీసుకున్నాడు. ఇందుకు తన పంట పోలంలోని ఓ పక్క మట్టి బెడ్డను ఏర్పాటు చేసి విత్తనాలను నాటాడు. వర్షం చినుకులకు విత్తనాలు కదలకుండా, మట్టిలో ఇంకిపోకుండా ఉండేందుకు పాత చీరల బెడ్డుపై పరిచి గోడుగులా ఆసరా చేశాడు. ఇలా వారం రోజులు ఉంచటంతో విత్తనాలు కదలకుండా ఉండి మొలకెత్తటం ప్రారంభించాయి. వీటిని వర్షానికి, ఎండ, గాలికి తట్టుకొని దృఢంగా పెరిగిన నారును తర్వాత పంట సాగుకు వాడుతామని రైతు తెలుపుతున్నాడు. నర్సరీ నారకుంటే ఇలా తయారు చేసిన నారు రెండు మార్లు దిగుబడి ఇస్తుందని రైతు తెలుపుతున్నాడు.

## 108 సిబ్బందికి సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్.ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన ఈఎంఆర్ఐ హెల్త్ సర్వీ సెస్ లో 108 అత్యవసర అంబులెన్సు సేవలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గుర్తింపు లభించిన సందర్భంగా ట్రస్టుచే మెడికల్ టెక్నీషియన్ కర్ణాకర్, పైలట్ కోటేషులను ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో రాష్ట్రస్థాయిలో హైదరాబాదులో 108 సంస్థ ప్రధాన కార్యనిర్వహణ అధికారి ఎంఏ ఖాలిదు వీరిని గుర్తించి గత బుధవారం అవార్డు ఇచ్చినందుకు గాను సంస్థచే సన్మానం చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ వైద్యానికి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ తో పాటు, ఆర్గనైజర్ శ్రవణ్, తొనుపునూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బడ్జెట్‌లో వరంగల్‌కు గుండు సున్నా
### బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో మన వరంగల్ జిల్లాకు బడ్జెట్ కేటాయించకుండా వరంగల్లు అభివృద్ధికి దూరంగా పెట్టేందుకు చేస్తున్న కుట్రకు నిరసనగా శుక్రవారం బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్ మాట్లాడుతూ తెలంగాణలో రెండవ అతిపెద్ద జిల్లా అయిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధులు కేటాయించకుండా జిల్లాను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రభుత్వానికి తెలిసి వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయకుమార్, దగ్గు విజేందర్ రావు, పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు శారద, రేపు మారేడుగొండ భాస్కరాచారి, దంచనాల సత్యనారాయణ, పాలకుర్తి తిరుపతి, ముత్యాల దేవేందర్, దామ సతీష్, బీరం రాజిరెడ్డి, పిట్ట కిషోర్,పెండెల రామకృష్ణ, తడక విక్రం, పల్లెబోయిన భద్రయ్య, మంతెన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ మంథని అసెంబ్లీ అధ్యక్ష బరిలో కుంభం మహేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాటారం :** కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మంథని అసెంబ్లీ అధ్యక్షుడిగా మల్హర్ మండలం కుంభంపల్లి గ్రామానికి చెందిన కుంభం మహేష్ రెడ్డి బరిలో ఉన్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆశీర్వదించి గెలిపించినట్లయితే అందరికి అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మహేష్ రెడ్డి పేర్కొన్నారు. మంథని నియోజకవర్గ యువకుల అభిప్రాయం మేరకు ఆన్ లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరిగే ఎన్నికల్లో పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడే ఈ అధ్యక్ష పోటీల్లో కార్యకర్తలు అందరూ తనకు మద్దతుగా యువకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రోత్సహించాలని, ఆన్ లైన్ ద్వారా తమకు ఓటు వేయించి అత్యధిక మెజార్టీ వచ్చేలా చూడాలని మహేష్ రెడ్డి కోరారు.

## సీపీని కలిసిన కమాండెంట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల మామూనూర్ నాలుగో బెటాలియన్ నూతన కమాండెంట్ గా బాధ్యతలు చేపట్టిన బి.రాం ప్రకాష్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు.

## కార్మికులకు గొడుగుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి తనయుడు నాయిని విశాల్ రెడ్డి జయంతి సందర్భంగా సోషల్ వర్కర్స్ కత్తుల అభిలాష్, కత్తుల కార్తీక్ అధ్వర్యంలో సుబేదారిలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక వేత్త ఈవీ.శ్రీనివాస్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ డీఈ ఎస్.సంతోష్ చేతుల మీదుగా గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్మికులకు గొడుగుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల తడవకుండా ఉండడానికి జీడబ్ల్యూఎంసీ కార్మికులకు గొడుగుల పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు శ్రీకాంత్, మేనక, వర్క్ ఇన్ స్పెక్టర్స్ రవి, ఓంప్రకాష్, జవాన్ -అనిల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గణపురం ఎస్ఐగా రేఖ అశోక్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, గణపురం :** భూపాలపల్లి జిల్లా గణపురం మండలం నూతన ఎస్ఐగా రేఖ అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ మండలం లో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తానని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు నెలకొన్న ప్రజలు నేరుగా సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో నిషేదిత గుట్కా, గుడుంబా, గంజాయి వంటి తదితర వాటిని అమ్మిన, కొన్న చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి విషయంలో పూర్తి అవగహనతో ముందుకు పోవాలని సూచించారు.

## జవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా వీర మరణం పొందిన వీరజవాన్ మాడిశెట్టి సతీష్ విగ్రహానికి వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్ పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ నివాళి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, డివిజన్ అధ్యక్షులు ఆకుతోట రాజు, కర్నే వాసుదేవ్, కిసాన్ మోర్చా నాయకులు బైరి నాగరాజు, బీజేపీ నాయకులు మాచర్ల చిన్నారావు, కపిల్ కుమార్ పాల్గొన్నారు.

## నిమ్మగడ్డ సుబ్బారావుకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ తండ్రి నిమ్మగడ్డ సుబ్బారావు ఇటీవల మరణించగా వారి స్వగ్రామం సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో వారి దశదిన కర్మ కార్యక్రమానికి పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, పరకాల మున్సిపల్ చైర్మన్ శ్రీ సోదా అనిత రామకృష్ణ కూడా పాల్గొని నివాళి అర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ మాజీ మార్కెట్ చైర్మెన్ బండి సారంగపాణి, మాజీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గాందే వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస రెడ్డి ,కార్యాకర్తలు పరకాల మున్సిపల్ కౌన్సిలర్స్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, పసుల లావణ్య రమేష్, బండి రాణి సదానందం గౌడ్, ఏకు రాజు, గొర్రె స్రవంతి రాజు, శనిగరపు రజిని నవీన్, అడప రాము, పాలకుర్తి గోపి, నాయకులు దూంపేట్ నాగరాజ్, బొచ్చు జెమిని పాల్గొన్నారు.



## ఔషధ మొక్కల పెంపకంతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** పరిపూర్ణమైన ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తి, సామర్థ్యం మెరుగుదలకు ఔషధ మొక్కలు ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఔషధ మొక్కల ప్రాధాన్యతను విద్యార్థులకు జిల్లా పరిషత్ మరిపెడ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్ల సమావేశంలో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ మొక్కలు పెంచే విధానంపై కోఆర్డినేటర్ నగేష్ మాట్లాడుతూ మొక్కల రక్షణ, మొక్కలు పెంచే విధానం పై గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ నుండి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు తులసి, తమలపాకు, సరస్వతి మొక్క, ఉసిరి, గోరింటాకు, అలోవెరా మొదలగు ఔషధ మొక్కలను ప్రధానోపాధ్యాయులు అనంతరావుకు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో ఎర్త్ క్లబ్ సభ్యులు మెడిసినల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ జిల్లా బాధ్యులు మామిడి శంకర్, మెంటర్ జె.రాజకుమారి, సైన్స్ ఉపాధ్యాయులు జనార్ధనా చారి, స్వప్న, ప్రకాష్, శౌరి, ఉపాధ్యాయ బృందం, లీడ్ ఎర్త్ లీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతన్నలంటే ఇంత చిన్న చూపా

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చేనేత రంగం ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ లో దేశవ్యాప్తంగా ఉన్న చేనేతల కోసం భిక్షం వేసినట్లు కేవలం 200 కోట్ల రూపాయలు మాత్రమే ప్రతిపాదించడం చూస్తే చేనేత ఎడల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా రాష్ట్రంలోని చేనేత కార్మికులను ఆదుకుంటుందని భావిస్తే పూర్తి నిరాశే మిగిలిందన్నారు .చేనేత పరిశ్రమ సంక్షోభానికి గురై సరైన పనులు లేక అప్పుల పాలై ఆత్మహత్యల పాలవుతున్న పాలకులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో నామమాత్రంగా రూ.369.74కోట్లు మాత్రమే చేనేత, జౌళి రంగానికి కలిపి వేశారని, అందులో చేనేతకు కేటాయించింది అత్యంత స్వల్పమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బడ్జెట్ లో సవరణలు చేసి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో పవర్లూమ్ కార్మికులు డిమాండ్ల సాధనకై చేస్తున్న ఆందోళన పోరాటాలకు తెలంగాణ చేనేత కార్మిక సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటించిందని, ఉద్యమాలు ఉధృతం కాక ముందే డిమాండ్లను పరిష్కరించాలని వెంకట్రాములు కోరారు.

# రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలి

### ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** నెలాఖరులోగా మొదటి విడత రుణమాఫీ పొందిన రైతులకు రెన్యువల్ చేసి తిరిగి రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్స్, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రుణమాఫీపై బ్యాంకుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల, పంట రుణాల రెన్యువల్, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ ఏంఈ, ఎంఎస్ఎంఈ లోన్స్ పై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు రైతులకు సమాచారం ఇచ్చి బ్యాంకులు దగ్గరకు వెళ్లి రెన్యువల్ చేసుకునేట్లు చూడాలని అన్నారు. బ్యాంకర్లు వారి వద్దకు వచ్చే ఫిర్యాధిదారుల వివరాలను ప్రతిరోజు కమిటీలకు పంపవలసిందిగా సూచించారు. జిల్లా స్థాయిలో రోజు వారి ఫిర్యాదుల వివరాలను సమీక్షించవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతు రుణమాఫీ అమలులో వెనుకంజలో ఉన్న బ్యాంకుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు, తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. మిగిలిన రుణమాఫీ నిధులను రైతుల సేవింగ్ అకౌంట్ లోకి త్వరగా విడుదల చేయాలని, అందుకు బ్యాంకర్లు వ్యవసాయ సహకార శాఖ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి, వెంట వెంటనే అమలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సమయాలు, పెంచి వారికి సేవలు అందించాలని ఆయన సూచించారు.రైతు రుణమాఫీ కోసం వచ్చే రైతులకు పూర్తిగా సహకరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. రుణమాఫీ పొందని రైతులను ఆందోళన చెందకుండా సమాధాన పరిచాల్సిన బాధ్యత బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులదేనని అన్నారు. ఈ సమావేశంలో ఎల్డీఎంటీ రాజ్‌కుమార్, ఎల్డీఓ ఆర్ బీఐ, ఎస్ బీఐ రీజినల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం, జిల్లా వ్యవసాయ అధికారి జయచంద్ర, జీఎం డీఐసీ కే.రమేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీసీఓ సర్దార్ సింగ్, బ్రాంచ్ మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌బీ కాలేజీలో ఘనంగా కార్గిల్ దివాస్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్సీసీ లాల్ బహదూర్ కళాశాల ఆర్మీ విభాగం ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధం ముగిసిన దినాన్ని"కార్గిల్ దివాస్ గా" భారత ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా కళాశాల ఆవరణలో కార్గిల్ అమరవీరులకు శ్రద్ధాంజలి గడించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పదవ తెలంగాణ బెటాలియన్ ఎన్సీసీ సుబేదారి మేయర్ సుహాస్ కదం హాజరయ్యారు. 1999లో పాకిస్తాన్ పై విరోచితం యుద్ధం చేసి విజయం సాధించడం చాలా గొప్పగా అనిపించిందని భారత ప్రజల నమ్మకాన్ని ఇండియన్ ఆర్మీ ఘన విజయాన్ని దేశ ప్రజలకు అందించిన ఈ శుభదినమన్నారు. టైగర్ హిల్స్ పై జెండా ఎగరేసిన గ్రూప్ కమాండర్ వరంగల్ కు రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని కల్నల్ సచిన్ అన్నారావు నిమ్బాకర్ వీర చక్ర వరంగల్ గ్రూప్ కమాండర్ గా నియామకం వరంగల్ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వదేశమంతా ఘనంగా కార్గిల్ విజయ దివాస్ ను జరుపుకుంటుందని తెలిపారు.కార్గిల్ విజయ వీరులకు అభినందన తెలిపడంతో పాటు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, జేసీఓ రఫీ, అధ్యాపకులు సీహెచ్ రవీందర్, వి.మధుకర్ రావు, హబల్దర్ కుమార్ డి, కళ్యాణ్ కుమార్ జూనియర్ అండ్ ఆఫీసర్, సంతోషి జూనియర్ అండ్ ఆఫీసర్, రాము నాయక్, సృజన క్వాటర్ మాస్టర్, శివాని, భాగ్యలక్ష్మి, యామిని, సాక్షి, నాగరాజు, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమానాలు అందజేశారు.

## పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో గల వివిధ మండలాలకు చెందిన అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలకు చెందిన 51మంది బాధితులకు మంజూరైన రూ.11,81,500 చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం.. ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే యశస్విని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు ఆమ్యా నాయక్, రాపాక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సోమా రాజశేఖర్, మండల అధ్యక్షులు సుంచు సంతోష్, రవీందర్ రెడ్డి, సురేష్ నాయక్, గిరగాని కుమారస్వామి, ముద్దసాని సురేష్, నల్ల శ్రీరామ్, పట్టణ వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు, పాల్గొన్నారు.

## జలప్రళయానికి నేటికి ఏడాది

గత వందల సంవత్సరాల నుంచి మునుపు ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో, ముఖ్యంగా భూపాలపల్లి నియోజకవర్గంలో భారీ వర్షాల ప్రభావంతో ఉధృతమైన వరదల ప్రళయం వల్ల చెరువుల కట్టలు, బ్రిడ్జిలు, రోడ్లు ముక్కలు ముక్కలుగా గండ్లు పడి కొంత ప్రాణ నష్టం..ఎన్నో మూగజీవాల జీవం తీసింది. గోదావరి పరివాహక ప్రాంతాలే కాకుండా కొన్ని గ్రామాల మధ్య జల దిగ్బంధం చేసి రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లలోకి వరద నీరు చేరి నిత్యావసర సరుకులు లేక అలమటించారు. ఆ వరదల వల్ల ఎంతో మంది ప్రజలు రైతులు నష్టాల పాలయ్యారు. అది ఎప్పటికీ చరిత్రలో జల ప్రళయం మరుపు రాని రోజుగా 2023 జులై 26 నుంచి నేటికీ సంవత్సర కాలం అవుతుంది.

**చెరువు తల్లి సంతోషం..**

భూపాలపల్లి నియోజకవర్గంలో సంతోషం వ్యక్తం చేస్తున్న చెరువులు..గత సంవత్సరం జూలై నుండి నేటికి సరిగ్గ సంవత్సరం ఉధృతంగా పొంగి పొరులుతు మాయదారి జలాలు వచ్చి మరుమగ్గాల పనిచేసి ఎదపై తన్ని తనువంత గాయాల పాలు చేసి రైతన్నలకు దూరం చేసి అనాధలుగా మార్చాయి అబాధలను చూసి నేను చెరువు చెరువు గా లేను గాయాల గండ్లతో ఎండుతున్నాం అని బాధలో ఉన్న సమయంలో ఎక్కడి నుంచి వచ్చాడో కానీ నాయకుడో, పాలకుడో పసిడి సేవకుడో చెంతకు వచ్చి చెయ్యందించి చేరదీశాడు. ఇప్పుడు వర్షపు తెల్లటి నీళ్లతో తనువును తాగి మేను పులకరించి పరవశించి పోతున్నాం. ఇప్పుడు రైతన్నతో దోస్తీ కట్టి పంట పొలాలలో నేలతల్లి శిఖలో పచ్చటి ప్రకృతి అందాలతో పంట పొలాలతో పురుడుపోసుకుని పరవశించిపోతాం.



కాత్రేవుల ఐలన్న, జర్నలిస్ట్

వరంగల్ వాయిస్ Evening Daily
శుక్రవారం 26, జులై 2024
www.warangalvoice.net

# నేరస్థులు తప్పు చేయాలంటే భయపడాలి

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కోర్ట్ లో చార్జి షీట్ వేసిన ప్రతి కంటేస్టెడ్ కేసులో శిక్షల శాతం పెంచేందుకు కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు, ఎస్సై, సీఐలు న్యాయ అధికారులతో కలిసి సమన్వయంతో కృషి చేయాలని, నేరాలకు పాల్పడితే శిక్ష పడుతుందనే భయం కలగాలని, ఆయా కేసులలో శిక్షల శాతం పెరగడం ద్వారా పోలీస్ వ్యవస్థ పై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. కేసులు నమోదై కోర్టులలో చార్జిషీట్ అయిన కేసులలో శిక్షల శాతం పెంచేందుకు తీసుకోవలసిన జాగ్రతలపై జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ (సీఓడీ) కోర్టు డ్యూటీ అధికారులతో జిల్లా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్థులను కట్టడి చేయాలంటే పకడ్బందీ దర్యాప్తు నిర్వహించి సరైన సాక్ష్యాధారాలైన సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక, వైద్య ఆధారాలను సేకరించి వాటిని సరైన పద్ధతిలో కోర్టుకు సమర్పించడం ద్వారా నేరస్థులకు కోర్టులో శిక్ష విధించడం జరుగుతుందన్నారు. తద్వారా, నేరస్థుల్లో నేరాలకు పాల్పడాలంటేనే భయం కలిగే పరిస్థితి వస్తుందన్నారు. రానున్న రోజుల్లో నేరస్థుల నేరాలను నిరూపణ శాతాన్ని పెంపొందించాలని, ముఖ్యంగా నేరస్థులకు శిక్ష పడటం ద్వారా బాధితలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ తెలిపారు. నేరానికి పాల్పడిన నేరస్థుడికి కనీసం ఆరునెల నుంచిఒక సంవత్సరం పైన శిక్షపడటం ద్వారా నేరస్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని, అందరూ సంబంధిత నేరం గురించి మర్చిపోక ముందే నేరస్థుడికి శిక్షను విధించడం ద్వారా నేరస్థులకు నేరాలు చేయాలంటే భయపడుతారని అన్నారు. అందుకు కోర్టు డ్యూటీ అధికారులు తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. కేసులలో సాక్షులను ప్రవేశపెట్టేటప్పుడు వారికి పూర్తిగా వివరించాలని, ఎప్పటికప్పుడు సీసీ నెంబర్లను పొందేటట్లు చూసుకోవాలని, సాక్షులు, ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యేలా చూసుకోవాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు. కాంటెస్టెడ్ కేసుల ప్రతి దశను ఎప్పటికప్పుడు ఎస్సై లకు, ఇన్ స్పెక్టర్లకు తెలియజేయాలని, కోర్టు డ్యూటీ అధికారులు, లైసనింగ్ అధికారులు, ఎస్ హెచ్ఓలు సమిష్టిగా పని శిక్షల శాతం పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. అలాగే కోర్ట్ డ్యూటీ అధికారులు బాగా పని చేస్తే అవార్డులు, రివార్డులు వస్తాయని, విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే మెమోలు కూడా వస్తాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ బాగా పనిచేసి జిల్లాకు, పోలీస్ శాఖ మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్బీ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్.ఐ పవన్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్‌కు గాడిద గుండు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర బడ్జెట్ లో గ్రేటర్ వరంగల్ కు నిధులు కేటాయించకుండా, ఎస్సీ స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ రూ.36'750 కోట్ల రూపాయల నుంచి 33,150 కోట్ల రూపాయలకు తగ్గించి దళితులపై వివక్ష చూపించిన రేవంత్ రెడ్డి సర్కార్ కు వ్యతిరేకంగా 45, 46 ,64 డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ నాయకులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ కో కన్వీనర్ తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, ఎల్కతుర్తి మండల ఇంచార్జి పొనగోటి వెంకట్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నాగవెల్లి గోపికృష్ణ, 45వ డివిజన్ అధ్యక్షుడు చెన్నబోయిన శివకుమార్, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ నవీన్, బీజేవైఎం జిల్లా నాయకులు తక్కలపల్లి నిఖిల్ రావు, స్థానిక నాయకులు దార ధనుంజయ్, గుర్రాల రాకేష్, మాచర్ల రంజిత్, దుప్పెల్లి అరవింద్, పసుల శ్రీకాంత్, బల్సుకురి లక్ష్మణ్, పండుగ రాజ్ కుమార్, కొడవటి అరవింద్, ఈర్ల హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి సీతక్క తనయుడు సూర్య పుట్టిన రోజు వేడుకలు



**వరంగల్ వాయిస్, ములుగు :** మండలంలోని ఇంచేర్ల ఎంఆర్ గార్డెన్ లో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కుమారుడు సూర్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది రక్త దానం చేయడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తల మధ్య సంబరాల్లో సూర్య పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ములుగు నియోజక వర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. మమ్ముల గుండెల్లో పెట్టుకొని అన్ని విధాలుగా అండగా ఉంటామని, నన్ను ఆశీర్వదించిన ప్రతిఒక్కరికీ పేరుపేరున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలపడంతో పాటు మీకు ఎల్లవేళలా సేవ చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, కాటారం :** మండల కేంద్రమైన కాటారం గ్రామంలోని గంటగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వర్షాకాలం కారణంగా విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.మౌనిక మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే గ్రామంలో పర్యటిస్తూ ప్రతి ఇంటింటికి తిరిగి డ్రై డే కూడా నిర్వహించారు. అలాగే ఇంటింటికి తిరిగి జ్వర సర్వే కూడా చేశారు. దోమ తెరలు వాడాలని, అలాగే దోమలు కుట్టకుండా పిల్లలు, పెద్దలు కాళ్ల, చేతులకు ఫుల్ షర్ట్స్, ఫుల్ పాయింట్స్ వేసుకోవాలని పేర్కొన్నారు. ఇంట్లో దోమలు ఉండకుండా మస్కిటో కాయిల్స్ వాడాలని వివరించారు. బజారులో దొరికే హిట్ స్ప్రే చేసుకోవాలని, ప్రజలు ముందు జాగ్రత్తగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ గీతా రాణి, డాక్టర్ ప్రియాంక, ఆరోగ్య విస్తరణ అధికారి తిరుపతి రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ తేజావత్ సమ్మయ్య, ఏఎన్ఎం శ్యామల, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, లత, సమ్మక్క, సత్యమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## లతిత రేపూడికి ఫార్మసీలో డాక్టరేట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఫార్మసీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ లలిత రేపూడి డాక్టరేట్ పొందారు. కేరీర్ పాయింట్ యూనివర్సిటీ, కోట రాజస్థాన్ లో ఫార్మసీ విభాగంలో డెవలప్ మెంట్ అండ్ వాలిడేషన్ ఆప్ లిక్విడ్ క్రోమాటోగ్రఫిక్ మెథడ్ ఫర్ క్వాంటిటేటివ్ ఎస్టిమేషన్ ఆఫ్ యాన్టీ హైపర్టెన్సివ్ ఏజెంట్స్ ఇన్ దెయర్ ఫార్మాస్యూటికల్ డోసెజ్ ఫార్మ్ప్ అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.లక్ష్మి సురేఖ పర్యవేక్షణలో లలిత రూపూడి పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం లలిత రేపూడి చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, హిమాయత్ నగర్ లో ఫార్మసి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు.

## ఓరుగల్లు లెజెండ్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా తూర్పు నియోజకవర్గంలోని మండి బజార్ ప్రాంతంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కన్నతల్లి ఫౌండేషన్ అధ్యక్షుడు కొండమీది రాజన్ బాబు ఆధ్వర్యంలో ఆగష్టు 4న రిసార్టులో ఏర్పాటు చేసిన ఓరుగల్లు లెజెండ్ ఓరుగల్లు రాణి రుద్రమదేవి పురస్కారం పోస్టర్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శ్రీమాన్ శిరీష్, బస్వరాజు పెద్ద కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొదాటి అనిల్ కుమార్, కాంగ్రెస్స్ పార్టీ నాయకులు గోరంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని యూనియన్ బ్యాంక్ మెనేజర్ ప్రత్యుష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రమోద్ అన్నారు. శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో 100 మొక్కలను స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు అందించారు. ఇందులో 50 మెడిసిన్ మొక్కలు, 20 పూల మొక్కలు, 20 పండ్ల మొక్కలు, 10 అలంకరణ మొక్కలు అందించామని వివరించారు. భవిష్యత్తు తరాల మనగడ కోసం కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని కోరారు. చెట్లను పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఇంచార్జి హెచ్ఎం అప్పిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ పరిధిలోని పర్వతగిరి, సంగెం, ఐనవోలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు డెకాయిట్లు సివియర్ క్రిమినల్ కేసులో ఉన్న ముద్దాయిలను మామునూరు ఏసీపీ తిరుపతి ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏమి చేశారో తెలియదని, ఇక నుంచి సత్ప్రవర్తన కలిగి ఉండాలని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాల్లో గాని, శాంతిభద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడిన చెడు నడత కలిగిన రౌడీ షీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలన్నారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సెటిల్మెంట్లు,భూదందాలు, అనవసరమైన పంచాయతీలకు వెళ్లకూడదని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లు ఏలాంటి కేసులు కాకుండా ఉంటే రౌడీషీట్ తీసివేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఎస్సై వెంకన్న, సంగెం ఎస్సై నరేష్, ఐనవోలు ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గోవింద రావు పేట :** మండలంలోని పస్రా హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకున్న 1986–87 బ్యాచ్‌కు చెందిన మిత్రుడు వావిలాల ప్రేమ్‌సుందర్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులకు తోటి బ్యాచ్ స్నేహితులు ఆర్థిక సాయం చేయాలని రూ. 26,500 జమ చేసి వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఎస్సెస్సీ 1987 బ్యాచ్ స్నేహితులు ఏనుగు శేఖర్ రెడ్డి, మహ్మద్ అంజాద్, దేవేందర్ రెడ్డి, సూడి వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సందా వెంకన్న, కాసగాని వేణుగౌడ్ పాల్గొన్నారు.

## గ్యాంగ్ మధ్య స్టోరీ .. ధనుష్ రాయన్




నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా ఆలౌరౌండర్ అనిపించుకుంటున్న కథానాయకుడు ధనుష్. అందుకే అలవోకగా 49 చిత్రాలు పూర్తి చేశాడు. స్వీయ దర్శకత్వంలో 50వ చిత్రంగా 'రాయన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఒక పేద కుటుంబానికి చెందిన రాయన్ (ధనుష్)కు ఇద్దరు తమ్ముళ్లు (సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్), ఒక చెల్లి (దుషారా విజయన్). చిన్నప్పుడే తల్లిదండ్రులు దూరమవుతారు. టౌన్‌కి వెళ్లొస్తామని చెప్పి మళ్లీ తిరిగిరారు. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు రాయన్ చేత కత్తిపట్టిస్తాయి. భయపడకుండా పోరాటం చేయడం అప్పట్నుంచే అలవాటవుతుంది. తన తోబుట్టువులకు అన్నీ తానై, ముగ్గురినీ వెంట పెట్టుకుని టౌన్‌కి చేరుకుంటాడు రాయన్. ఓ మార్కెట్లో పనిచేస్తూ నలుగురూ అక్కడే పెరిగి పెద్దవుతారు. అక్కడ దురై (శరవణన్), సేతు (ఎస్.జె.సూర్య) గ్యాంగ్స్ మధ్య ఎప్పట్నుంచో ఆధిపత్య పోరాటం కొనసాగుతుంటుంది. ఆ గొడవలు రాయన్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేశాయి? తన తమ్ముళ్లు, చెల్లెలు కోసం రాయన్ ఏం చేశాడు? రాయన్ కోసం వాళ్లు ఏం చేశారు? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. ప్రతీకారంతో ముడిపడిన గ్యాంగ్ వార్ కథలు, అందులో ఉండే పాత్రల మధ్య సంఘర్షణ ఆ సినిమా విజయానికి కొలమానంగా నిలుస్తాయి. కథగా చూస్తే 'రాయన్'లో కొత్తదనం లేకపోయినా, కొన్ని మలుపులు, కుటుంబ డ్రామా, కథా నేపథ్యం ప్రత్యేకంగా మార్చేశాయి. విరామానికి ముందు వచ్చే ఆ సన్నివేశాలు సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లడంతోపాటు, ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. దురైతో పోరాటం తర్వాత సింహంలా బలంగా కనిపించిన రాయన్, ఆ తర్వాత తోడేల్లాంటి సేతు (ఎస్.జె.సూర్య) ఎత్తులకు దొరికిపోయాడా?లేదా?అనే విషయాలు కీలకం. ముఖ్యంగా ఆస్పత్రిలో పోరాట ఘట్టాలు, సేతు మనిషిని ఇంటికి పిలిపించి చంపి, టీ తాగడం తదితర సన్నివేశాలు ప్రేక్షకులలతో ఈలలు కొట్టిస్తాయి. రక్తపాతం, తమిళ వాసనలతో కూడిన కొన్ని అతి సన్నివేశాలు ఉన్నప్పటికీ... ఒక మామూలు కథని ధనుష్ తన అండర్ ప్లే నటనతో, వైవిధ్యమైన కొన్ని మాస్ ఘట్టాలతో రక్తి కట్టించే ప్రయత్నం చేశాడు. హత్తుకునే భావోద్వేగాల్ని పండించే అవకాశం ఉన్న కథే అయినా, ధనుష్ ఆ దిశగా దృష్టి సారించలేదు.

# పాత కథకు కొత్తగా రంగులు




### రాజ్‌తరుణ్ పురుషోత్తముడు మూవీ

రాజ్‌తరుణ్‌కు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. అటు కెరీర్‌పరంగా సరైన హిట్ లేదు, ఇటు వ్యక్తిగత జీవితంలోని వివాదాలు తన ఇమేజ్‌ను మసక బారుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో వచ్చిన 'పురుషోత్తముడు' శుక్రవారం విడుదలయ్యింది. రచిత్ రామ్ (రాజ్‌తరుణ్) పుట్టుకతోనే కోటీశ్వరుడు. భారత్‌లోని గొప్ప వ్యాపారవేత్తల్లో ఒకరైన పీఆర్ గ్రూప్స్ అధినేత ఆదిత్య రామ్ (మురళీ శర్మ) తనయుడు. లండన్‌లో చదువులు పూర్తి చేసుకుని దేశానికి తిరిగొస్తాడు. అతను వచ్చీ రాగానే పీఆర్ గ్రూప్స్ కొత్త సీఈవోగా నియమించాలని ఆదిత్య రామ్ నిర్ణయించుకుంటాడు. కానీ, దానికి రచిత్ పెద్దమ్మ వసుంధర (రమ్యకృష్ణ) అడ్డు చెబుతుంది. కంపెనీ బైలా ప్రకారం సీఈవోగా ఎంపికవ్వాల్సిన వ్యక్తి ఎవరైనా సరే 100రోజుల పాటు ఓ సామాన్యుడిలా అజ్ఞాత జీవితం గడపాల్సిందేనని పట్టుబడుతుంది. దీంతో రచిత్ తనని తాను నిరూపించుకునేందుకు ఇంటి నుంచి బయటకొచ్చేస్తాడు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కడియం సమీపంలో ఉన్న రాయపులంక అనే పల్లెటూరికి చేరుకుంటాడు. మరి అక్కడికి వెళ్లాక రచిత్ రామ్ జీవితం ఎన్ని మలుపులు తిరిగింది?ఓ రైతు కూలీగా కొత్త జీవితాన్ని ప్రారంభించిన అతను.. ఆ తర్వాత ఆ ఊరి పూల రైతుల్ని కాపాడేందుకు ఎలాంటి సాహసాలు చేశాడు? రచిత్‌కు.. అమ్ము (హాసినీ సుధీర్)కు మధ్య చిగురించిన ప్రేమ ఎలాంటి మలుపు తిరిగింది? అన్నది మిగిలిన కథ. కోటీశ్వరుడైన కుర్రాడు కొన్ని వ్యక్తిగత లక్ష్యాల కోసం అన్నీ వదులకొని ఓ సామాన్యుడిలా కొన్నాళ్లు అజ్ఞాత జీవితం గడపాల్సి రావడం.. ఈ క్రమంలో ఓ పల్లెటూరికి వచ్చి అక్కడ సమస్యల్ని పరిష్కరించి ఆ ఊరికి దేవుడిగా మారడం.. ఈ తరహా కథాంశాలు వెండితెరకేం కొత్త కాదు. 'పురుషోత్తముడు' కూడా ఆ తాను ముక్కే. కథలోనూ.. తెరపై ఆవిష్కరించడంలోనూ ఏమాత్రం కొత్తదనం కనిపించదు. ఇది ఓ కోణంలో 'శ్రీమంతుడు'కు పాత వెర్షన్‌లా.. ఇంకో కోణంలో 'బిచ్చగాడు'కు అప్‌డేట్ వెర్షన్‌లా కనిపిస్తుంది.


# తెలుగువారు కళకు ప్రాధాన్యం ఇస్తారు




### దేవర విశేషాలను వివరించిన జాన్వీకపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ టాలీవుడ్ అగ్ర హీరో ఎన్టీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. గత నాలుగు రోజులుగా ఆమె తాజా చిత్రం 'ఉలర్ఝ్' సినిమా ప్రమోషన్లో బిజీగా ఉంది. ప్రతి ఇంటర్వ్యూలోనూ తారక్ గురించి ప్రస్తావిస్తోంది. అతని యాక్టింగ్, డాన్స్ గురించి పదేపదే చెబుతోంది. వీరిద్దరూ కలిసి 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ ఆఖరి దశలో ఉంది. ఈ మేరకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవర సినిమా షూటింగ్ అనుభవాలను షేర్ చేశారు జాన్వీ కపూర్. 'తెలుగువారి పనితీరు నాకు ఎంతో ఇష్టం. వారు కళను, సినిమాను గౌరవిస్తారు వారి వ్యవహారం హుందాగా ఉంటుంది. కథపై నమ్మకంతో పని చేస్తారు. ప్రస్తుతం నేను 'దేవర'లో నటిస్తున్నా. జూనియర్ ఎన్టీఆర్ ఎనర్జిటిక్ హీరో. ఆయన రాగానే సెట్‌కే కళ వస్తుంది. అందరూ ఉత్సాహంగా ఉంటారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో మా ఇద్దరిపై ఓ పాటను చిత్రీకరించారు. తారక్ డాన్స్ వేగాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఎన్టీఆర్ ఒక్క సెకనులో దేన్నైనా నేర్చుకోగలరు. అదే విషయాన్ని నేర్చుకోవడానికి నాకు 10 రోజులు పడుతుంది. ఆయనతో తర్వాత పాట షూటింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నా. దర్శకుడు కొరటాల శివ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఏ విషయమైనా సున్నితంగా చెబుతారు. ఆయనతో కలిసి పనిచేయడం ఈజీగా ఉంది' అని అన్నారు. వ్యక్తిగత విషయాల గురించి చెబుతూ 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నా తల్లిదండ్రులు నేర్పారు. వాళ్లతో పాటు నా ఫ్యాన్స్ నన్ను చూసి గర్వించేలా ఉంటాను. ప్రస్తుతం సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాను. రిలేషన్ గురించి వెల్లడించే సమయం లేదు. ఇటీవల ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బంది పడ్డాను. ఇప్పుడే కోలుకుంటున్నా' అని జాన్వీ చెప్పారు.






# మార్ ముంతా ఛోడ్ చింతా మాస్ డ్యూయెట్

### ఎవరినీ కించపరిచే ఉద్దేశ్యం లేదు: మణిశర్మ

రామ్ పోతినేని–పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' కావ్యా థాపర్ కథానాయిక. ఆగస్టు 15న ఈ మాస్ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల దీనినుంచి 'మార్ ముంతా ఛోడ్ చింతా' అనే మాస్ పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ పాట మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. మణిశర్మ సంగీత దర్శకత్వంలో రాహుల్ సిప్లిగంజ్ దాన్ని ఆలపించారు. తాజాగా ఈ పాటకు సంబంధించిన పలు ఆసక్తికర విశేషాలు వీళ్లిద్దరూ పంచుకున్నారు. మా ఇద్దరి కాంబినేషన్‌లో చాలా విభిన్నమైన పాటలు వచ్చాయి. పోకిరిలోని 'డోలె డోలె', ప్రభాస్ 'ఏక్ నిరంజన్'లోని పాటలు, పవన్‌కల్యాణ్ సినిమాలోని 'మెలికల్ తిరుగుతుంటే అమ్మాయో' వంటి పాటలు హిట్‌గా నిలిచాయి. పూరీ జగన్నాథ్ పాట కాన్సెప్ట్‌ను ఐదు నిమిషాల్లో చెప్పేస్తారు. నాకు పూర్తి స్వేచ్ఛనిస్తారు. 'ఇస్మార్ట్ శంకర్'లో వచ్చిన 'దిమాక్ ఖరాబ్'ను 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట మరిపించాలని చెప్పారు. చాలా కష్టమనుకున్నాను. 2 రోజులు ఆలోచించా. చివరకు షాపింగ్‌కు వెళ్తూ ట్యాక్సీలో ఓ ట్యూన్ విన్నా. అలా ఈ పాట ప్రయాణం మొదలైంది. అది సంచలనం సృష్టించింది. కొన్ని వింతలు మన ప్రమేయం లేకుండా జరుగుతాయి. వాటిని మనం ఎంజాయ్ చేయాలంతే. చాలామంది ఈ పాటను ఐటెమ్ సాంగ్ అనుకుంటున్నారు. కానీ, ఇది డ్యూయెట్. సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా దీని లిరిక్స్ రాశాం. కేసీఆర్ గారంటే అందరికీ గౌరవం ఉంది. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో నేను ఎవరినీ నొప్పించలేదు. ఈ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. దయచేసి అలానే అందరూ భావించండి. ఇది కేవలం వినోదం కోసమే అన్నారు.

# సఖి కేంద్రంలో కలెక్టర్

## మహిళల్లో అవగాహనపై ఆరా

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సఖి వన్ స్టాప్ కేంద్రాల ద్వారా అందించే సేవలపై విస్తృతంగా మహిళల్లో అవగాహన కల్పించడానికి కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సూచించారు. శుక్రవారం ఎక్సైజ్ కాలనీలోని జిల్లా సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. సోషల్ మీడియా ద్వారా సఖి కేంద్రాలు అందిస్తున్న సేవలకు ప్రచారం కల్పించి మహిళల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సఖి-వన్ స్టాప్ కేంద్రం ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయంగా కౌన్సిలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం, పోలీస్ సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక వసతి పొందిన వారికి కిట్ లను కూడా ఇవ్వటం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు, హింసల నుంచి రక్షణ కల్పించడానికి వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి వన్ స్టాప్ సెంటర్ కృషి చేస్తుందన్నారు. సఖి కేంద్రాన్ని సంప్రదించడానికి మహిళా హెల్ప్ లైన్, ఆడపిల్లల హెల్ప్ లైన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సఖి కేంద్రాన్ని సంప్రదించేందుకు ఎల్లప్పుడు 0870-2452112 నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని బాధితులకు వీడియో కౌన్సిలింగ్ కు ఏర్పాట్లు చేయాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో సఖి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు వివరిస్తూ గోడపత్రికలు అంటించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు స్థానిక ఛానల్స్ లో వీడియోల ద్వారా సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై ప్రచారం చేసి



మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సఖి కేంద్రం కొరకు నిర్మిస్తున్న నూతన భవనాన్ని సందర్శించి మిగిలి ఉన్న పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యు ఓ మధురిమ, సఖి సెంటర్ ఆర్గనైజర్ హైమావతి, రహదారులు భవనాలు శాఖ ఈఈ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష..



జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా మొదటి దశలో మంజూరైన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశంలో మండలాల వారీగా ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈఓలతో మంజూరైన పనులు ఎంతవరకు పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు.




# ఏవీవీ విద్యార్థుల కార్గిల్ దివస్ ర్యాలీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం మన సైనికులకు వందనాలు తెలియజేస్తూ, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా ర్యాలీ నిర్వహించారు. 1999లో కార్గిల్ మంచు కొండల చాటున దొంగ దెబ్బ తీయాలనుకున్నా పాకిస్థాన్ కుట్రలను దీటుగా ఎదుర్కొన్న మన సైనికుల పోరాట ప్రతిభ, పరాక్రమకు ప్రదర్శిస్తూ ఒకవైపు తమ సహ సైనికులు చనిపోతున్న విజయం కోసం పోరాడిన తీరుతో పాకిస్తాన్ తోక ముడిచింది. భారత్ విజయం సాధించింది. మే 3 నుంచి జూలై 26 వరకు 73 రోజుల పాటు సాగిన యుద్ధంలో విజయాన్ని భారత ప్రభుత్వం 'కార్గిల్ విజయ్ దివస్'గా ప్రకటించడంతో ఈరోజు విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే విధంగా భారత జాతీయ పతాకంతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బుజేందర్ రెడ్డి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.అనిత, వీరేశలింగం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు మొండి చెయ్యి

## గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో గిరిజనులకు మరోసారి మొండి చేయి చూపారని తెలంగాణ గిరిజన సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్ ఆరోపించారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్ లో గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మొదటి నుంచి గిరిజనుల పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య నిర్మాణ బాధ్యులు మద్దెల ఎల్లేష్, జిల్లా అధ్యక్షురాలు



లావుడ్యా రమాదేవి, జిల్లా నాయకులు ఎం.బిక్షపతి, కె.వెంకటేష్, ఆర్.కుమార్, ధరావత్ అశోక్, అరుణ, మాలోత్ సరూప, మంగ, పవన్, దేవరాజుల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# సర్వీస్ రూల్స్ సవరణపై హర్షం

## మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపిన ఎండోమెంట్ ఉద్యోగులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్ ను సవరించినందుకుగాను 'తెలంగాణ దేవాదాయశాఖ దేవాలయ ఉద్యోగుల సంఘం' ఆధ్వర్యంలో శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ధన్యవాదాలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మంత్రి సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం చేశారు. సీనియారిటీ లిస్ట్ ను వీలైనంత త్వరగా సిద్ధం చేసి, ప్రమోషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సురేఖకు దేవాలయ ఉద్యోగుల సంఘం విన్నవించింది. వారి విన్నపానికి మంత్రి సురేఖ సానుకూలంగా స్పందించారు.




# తెలంగాణ హక్కుల కోసం కొట్లాడండి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీకి రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలున్నప్పటికీ లోక్ సభలో ఎనిమిది నిమిషాలు మాట్లాడలేదని, ఎనిమిది కొత్తలు తీసుకురాలేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన కాజీపేటలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బోయినపల్లి మాట్లాడుతూ కేంద్ర మంత్రులు పదవిపోయిన పర్వాలేదు..తెలంగాణ హక్కుల కోసం కొట్లాడాలంటూ పిలుపునిచ్చారు. ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం నిరసన తెలుపుతున్న వారికి సంఘీభావం ప్రకటించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ లను సాధించే వరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 15 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు స్పీకర్ వెల్ లో నిరసన చేపట్టాలన్నారు. ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 1985 నుంచి పోరాటం చేస్తున్నా పాలకుల్లో స్పందన కరువైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల ప్రయత్నలోపం కారణంగానే తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ లోపభూయిష్టమైన నిర్ణయాలతో వర్షాకాలంలో కూడా తెలంగాణలోని ప్రాజెక్టుల్లోకి నీళ్లు చేరడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నేపల్లిలో సారలమ్మ పూజారి మృతి



**వరంగల్ వాయిస్, తాడ్వాయి :** తాడ్వాయి మండలంలోని కన్నేపల్లిలో సారలమ్మ పూజారి కాక సంపత్ (38) శుక్రవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సంపత్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్ కి వెళ్లే క్రమంలోనే మార్గం మధ్యలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సంపత్ కు భార్య, తల్లి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సంపత్ మృతితో కన్నేపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com